రూ.12కోట్లతో మలక్‌పేట ఆర్‌యూబీ మూడో వెంట్

- రూ.3కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం
- అయినా ఇంకా అందుబాటులోకి రాని వైనం
- ప్రస్తుతం ఇరుకు రోడ్డుతో ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్



పూర్తయినా అందుబాటులోకి రాకపోవడంతో తాత్కాలిక బారికేడ్లతో మూసి ఉన్న మలక్‌పేట ఆర్‌యూబీ మూడో వెంట్

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట వైపు ప్రతినిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు మలక్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలోని ఆర్‌యూబీకి అనుసంధానంగా కొత్తగా మరో వెంట్(ఆర్‌యూబీ) నిర్మించారు. ఇందుకు గాను రైల్వే శాఖ రూ.12కోట్లను వెచ్చించింది. కొత్తగా నిర్మించిన మూడో వెంట్ నుంచి వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలుగా మరో రూ.3కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రత్యేక చొరవ తీసుకుని దక్షిణ మధ్య రైల్వే శాఖాధికారులతో పలుమార్లు చర్చించి రూపొందించిన ప్రతిపాదనల మేరకు కొత్తగా ఆర్‌యూబీ కార్యరూపం దాల్చింది. దాదాపు నాలుగేళ్లపాటు సాగిన ఈ ఆర్‌యూబీ నిర్మాణం కారణంగా ఇటు వాహనాల రాకపోకలకు, అటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక దశలో ఆర్‌యూబీ నిర్మాణం కారణంగా రైల్వేట్రాక్ కొంతవరకు దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దాదాపు వారం రోజుల పాటు రైళ్ల రాకపోకలను నిలిపివేసి రైల్వేట్రాక్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. దీంతో అటు రైల్వేట్రాక్‌తోపాటు, ఆర్‌యూబీ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. ఒకవైపు ఆర్‌యూబీ పనులు జరుగుతుండగానే రైల్వే శాఖాధికారులు ట్రయల్ రన్ నిర్వహించి మలక్‌పేట రైల్వే స్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

నిధుల మంజూరుకు రెండేళ్లు, మరో వెంట్ నిర్మాణానికి నాలుగేళ్లు

చాదర్‌ఘాట్‌లోని మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఆర్‌యూబీకి రెండు వెంట్లను నిర్మించారు. దిల్‌సుఖ్‌నగర్ మలక్‌పేట మీదుగా వచ్చే వాహనాలు కోఠి, ఎంజీబీఎస్, చార్మినార్ వైపుకు ఇటు సైదాబాద్ మీదుగా వచ్చే అన్ని రకాల వాహనాలు ఈ రెండు వెంట్ల నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. ఒక వైపు ఉన్న వెంట్ కుడివైపుకు మలక్‌పేట రైల్వేస్టేషన్ ఉండడంతో ఇటు వైపు మరో వెంట్‌ను నిర్మించేందుకు అవకాశం లేదు. ఇక అటు వైపు ఉన్న వెంట్‌కు ఎడమ వైపు మరో వెంట్ నిర్మించేందుకు ఉన్న అవకాశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు మూడో వెంట్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లి పలుమార్లు ఇక్కడ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను విన్నవించారు. ఇప్పుడున్న రెండు వెంట్లకు అనుసంధానంగా మూడో వెంట్ నిర్మించాలని నిర్ణయించి రూపొందించిన ప్రతిపాదనలకు రూ.12కోట్ల నిధులను రైల్వేశాఖ మంజూరు చేసింది. నిధుల మంజూరుకు దాదాపు రెండేళ్ల సమయం పట్టగా, వెంట్ నిర్మాణానికి నాలుగేళ్లు పట్టింది.

పూర్తయిన ఏడాదికి రూ.3కోట్లతో రోడ్డు నిర్మాణం



మలక్‌పేట ఆర్‌యూబీకి అనుసంధానంగా మూడో వెంట్ నిర్మాణ పనులు పూర్తయి ఏడాది గడిచింది. వెంట్ నిర్మాణం పూర్తయినా వెంట్‌ను కలుపుతూ రోడ్డు పునరుద్ధరణకు మరో ఏడాది పట్టింది. కొత్తగా నిర్మించిన మూడో వెంట్‌ను కలుపుతూ నూతనంగా రోడ్డు నిర్మించేందుకు హెచ్‌ఆర్‌డీసీఎల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పలుమార్లు చర్చించడం జరిగింది. దీనికి రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణంలో జరిగిన జాప్యానికి తోడుగా తాజాగా ఎమ్మెల్సీ కోడ్ అమలులోకి రావడంతో మూడో వెంట్(ఆర్‌యూబీ) ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ఏది ఏమైనా వీలైనంత త్వరగా మూడో వెంట్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం. - అహ్మద్ బలాల, ఎమ్మెల్యే మలక్‌పేట

తుర్కయంజాల్‌లో ప్రభుత్వ భూమి కబ్జా



తుర్కయంజాల్ ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 399లో అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు

హయత్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లోని సర్వేనంబర్ 399లోని ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ వ్యక్తి ఆక్రమించుకుని అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తుండగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు అడ్డుకుని దాన్ని నేలమట్టం చేశారు. తిరిగి గురువారం మళ్లీ నిర్మాణం ప్రారంభించారు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే కాకుండా సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని ప్లాట్లల్లో కలుపుకుని క్రయ విక్రయాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి పదోన్నతి



సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డికి పదోన్నతి లభించింది. గ్రేడ్-3 కమిషనర్లుగా కొనసాగుతున్న పలువురు కమిషనర్లను ప్రభుత్వం గ్రేడ్-2 కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్రేడ్-3 కమిషనర్‌గా ఉన్న రవీందర్‌రెడ్డికి గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొందారు. దీంతో ఆయన ఆనం దం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మే 15న తిరుపతిలో జరుగనున్న 17వ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మహాసభల పోస్టర్‌ను గురువారం హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభలకు ఎల్బీనగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యువత వ్యతిరేక కార్యక్రమాలు, విద్య, వైద్యం, ఉపాధి, మీడియా స్వేచ్ఛ, రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పశ్చిమబెంగాల్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ ఆందోళన



సైదాబాద్ ప్రధాన రహదారిపై బీజేపీ నేతల నిరసన ప్రదర్శన

సైదాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శుక్రవారం సైదాబాద్‌లో బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ దిష్టిబొమ్మ దహనం చేశారు. మమతాబెనర్జీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు. దాడుల వెనుక ఉగ్రవాదుల హస్తం బయటపెట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, నాయకులు సహదేవ్‌యాదవ్, వీరేందర్‌యాదవ్, లింగాల హరిగౌడ్, శ్రీనాథ్, మహేష్ పాల్గొన్నారు.

స్వాన్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం



సురేష్‌బాబు, అధ్యక్షుడు



విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి

సైదాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ మలకపేట బీ బ్లాక్ కాలనీలోని స్వాన్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రొఫెసర్ సురేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా బి.గంగాధర్, పద్మాల శంకర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.విజయభాస్కర్, కోశాధికారిగా వేణు, ప్రచార కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ, జాలివాకర్‌గా ప్రకాష్ రెడ్డి, సలహాదారులుగా పాల మధుసూదన్, డైరెక్టర్లుగా సూర్యప్రకాశ్, కల్లెం రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, జనార్దన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా లగుశెట్టి విజయ్‌కుమార్, మాణిక్‌ప్రభు నియమితులయ్యారు.

ఫైర్ ఫైటర్ల పోరాటం వెలకట్టలేనిది



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బలాల, ఫైర్‌ఆఫీసర్ అంజిరెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల మంటలను అదుపులోకి తెచ్చే క్రమంలో ఫైర్ ఫైటర్లుగా పిలిచే అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలను తెగించి చేసే కృషి వెలకట్టలేనిదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో మలక్‌పేట ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ సారెడ్డి అంజిరెడ్డి, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందని తెలిపారు.

బస్తీ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



మోహన్‌నగర్ బస్తీలో మహిళ సమస్యను వింటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బస్తీ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో మోహన్‌నగర్‌బస్తీలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బస్తీల్లో మెరుగైన సదుపాయాలు కల్పించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని వారన్నారు. చిత్తారమ్మ గుడి ఆవరణలో నాయకులు చీపురు చేతబట్టి వ్యర్థాలను తొలగించారు. బస్తీ వాసులతో కలిసి వారు సహపంక్తి భోజనం చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- సవరణల పేరుతో రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ కుట్ర
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి ఆరోపణ



స్థానికులతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న పారిజాతారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు సమన్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉన్నదని, బీజేపీ పాలనలో రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉన్నదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. సవరణల పేరుతో రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని, ఆ ప్రయత్నం ముమ్మాటికీ రాజ్యాంగాన్ని అవమానించడమేనని ఆమె పేర్కొన్నారు. టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదిళ్ల జంగయ్య తదితరులతో కలిసి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లి రంగనాయకుల బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పారిజాతారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంతో పాటు గాంధీ, అంబేడ్కర్ పట్ల కేంద్రం అవమానకరంగా వ్యవహరిస్తున్నదని, ప్రజలు దీనిని గమనించి బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సోనియా, రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో సమన్యాయం సాధ్యమని ఆమె అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లాల్ సతీశ్‌గౌడ్, బి.కుమార్, ఎస్.విజయ్, తిరుమల్, భాస్కర్, నరేందర్, రాము, బాలకృష్ణ, రుక్కమ్మ, విజయ్, కృష్ణ, చెన్నయ్య, మంజుల, బాలమ్మ నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నేను శంకుస్థాపనలు చేసిన పనుల వద్ద ఫొటోలు దిగుతూ షో చేస్తున్నరు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు తూర్పు 21 కాలనీల డ్రైనేజీ లైన్ల కోసం తాను దాదాపు 6కోట్ల నిధులను మంజూరు చేసి శంకుస్థాపనలు చేస్తే ఇవి శిలాఫలకాలకే పరిమితం అవుతాయని, ఎలక్షన్ స్టంట్ అని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీ, స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డిలు ఆ పనుల దగ్గర ఫొటోలు దిగుతూ షో చేస్తున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ రాచకాలువ పరిధిలోని రాచకాలువ డ్రైనేజీ ట్రంక్‌లైన్ నిర్మాణం కోసం రెవెన్యూ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ ఔట్‌లెట్ పోయే దారిలేక పనులు జక్కిడి రామస్వామిరెడ్డి కాలనీ వరకే నిలిచిపోయాయన్నారు. ఈ పనుల కోసం స్థానిక కార్పొరేటర్ ఎలాంటి ప్రయత్నం చేయకపోగా తామే డ్రైనేజీ పనులు ఆపుతున్నామని కాలనీల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా డ్రైనేజీ ఔట్‌లెట్ కోసం తాము తీవ్ర ప్రయత్నం చేసి పురాతనమైన రాచకాలువను గుర్తించి ఈ కాలువగుండా ట్రంక్‌లైన్ వేద్దామని తాము ప్రణాళిక చేస్తుంటే కార్పొరేటర్ అక్రమ వసూళ్లకు తెరలేపి తన అండదండలతో అనేక చోట్ల రాచకాలువ మీద అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఆ విషయాలు త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. రాచకాలువపై చేపట్టిన అక్రమ కట్టడాలన్నీ హైడ్రా దృష్టికి తీసుకెళ్లి కూల్చివేయిస్తామన్నారు. ఎమ్మార్వో, సర్వేయర్, ఆర్ఐ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఈ రాచకాలువ సర్వే మొత్తం పూర్తి చేశారని, రెండు, మూడు రోజుల్లో మార్కింగ్ చేసి డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం రాజ్‌గోపాల్, సర్వేయర్ జ్యోతి, ఇరిగేషన్ డీఈ శుక్లజ, గాయత్రినగర్‌కాలనీ ఫేజ్-2 అధ్యక్షులు ఆవుల రమేష్, మనోజ్‌కుమార్, శశికాంత్, నందకిషోర్, సతీష్ గౌడ్, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్, మలక్‌పేటలో భారీ వర్షం



సైదాబాద్‌కాలనీ గాంధీ పార్కులో చెట్టు కూలి ధ్వంసమైన కారు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్, మలక్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాల్లో ఈదురుగాలులతో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒకవైపు భారీ వర్షం కురుస్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 6గంటల నుంచి గంట పాటు మూసారాంబాగ్, చాదర్‌ఘాట్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు జరగలేదు. దీంతో మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



చాదర్‌ఘాట్‌లో రోడ్డుపై కురుస్తున్న వర్షం

చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో..

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో గాలి, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రధాన రహదారులతో పాటు, కాలనీలు, బస్తీలలోని రోడ్లు పూర్తిగా వర్షం నీటితో జలమయం అయినవి. చంపాపేట చౌరస్తాలోని సాగర్ ప్రధాన రహదారిపై డీ మార్టు ముందు రహదారిపై వర్షం నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురైనవి.

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో..

వనస్థలిపురం : వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో మోస్తారు వర్షం కురిసింది. హయత్‌నగర్ డివిజన్ హుడాసాయినగర్ కాలనీ ప్రధాన రహదారిపై గాలికి చెట్టు విరిగి రోడ్డుపై పడింది. అదేవిధంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందావన్‌కాలనీ, సౌభాగ్యనగర్, మహాలక్ష్మీకాలనీ, గాయత్రినగర్‌కాలనీలతో పాటు ఇతర కాలనీల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచింది. వనస్థలిపురం పనామా, సుష్మాచౌరస్తా, చింతలకుంట, ఇతర లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు వర్షపు నీరుతో వరదమయమైంది.



చంపాపేట చౌరస్తాలోని సాగర్ రోడ్డుపై డీమార్టు ఎదుట నిలిచిన వర్షం నీరు

సరూర్‌నగర్‌లో..

సరూర్‌నగర్‌లో కురిసిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయమై రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షం ప్రారంభం కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఘనంగా గుడ్ ఫ్రై డే ప్రార్థనలు



దిల్‌సుఖ్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సీనియర్ పాస్టర్ సాల్మాన్, పాస్టర్ శాంతకుమార్, లూకానందరావు, ఇందర్‌జీ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శుభ శుక్రవారం ఆశీర్వాదములు మూసారాంబాగ్‌లోని బేతనియా బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించారు. ఏసు సిలువపై పలికిన ఏడు మాటలపై చర్చి పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ బాబు బైరపోగు ధ్యానం చేయించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో కమిటీ అధ్యక్షుడు లూకానందరావు, ఉపాధ్యక్షురాలు రాణి ప్రమీల, సంయుక్త కార్యదర్శి విజయశేఖర్, కోశాధికారి ఇందర్‌జీల పర్యవేక్షణలో జరిగిన గుడ్ ఫ్రై డే ప్రార్థనల్లో సీనియర్ పాస్టర్ బోడ సాల్మాన్, జూనియర్ పాస్టర్ శాంతకుమార్, ఇంద్రానగర్‌లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో పాస్టర్ ఇమాన్యుయల్ ప్రార్థనలు చేశారు.



న్యూ శివగంగకాలనీలోని హోసన్నా మందిరంలో గుడ్ ఫ్రైడే సందేశం ఇస్తున్న పాస్టర్ ఎం.వర్మ

హోసన్నా మందిరంలో..

కొత్తపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధి న్యూ శివగంగ కాలనీలోని హోసన్నా మందిరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ఆరాదన ఉత్సవం నిర్వహించారు. ఆ సందర్భంగా పాస్టర్ ఎం.వర్మ బైబిల్ సూక్తులను చదివి సందేశం ఇచ్చారు. క్రీస్తు మానవాళి కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. ఆరాదనలో పెద్ద సంఖ్యలో హాజరైన క్రైస్తవులు కీర్తనలను పాడారు. ఈ ఉత్సవంలో పాస్టర్లు పౌలు, డేవిడ్, రవిచంద్రకుమార్, జకరియా, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ



వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధీర్‌బాబు

వనస్థలిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ను రాచకొండ సీపీ సుధీర్ బాబు శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, పెట్రోలింగ్ స్టాఫ్, రిసెప్షన్, సీసీ టీవీల నిర్వహణ, సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది పనితీరును ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను సీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పలు పోలీసు స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించడానికి పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి

- హయత్‌నగర్ అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ యాదగిరి



అగ్నిమాపక వారోత్సవాల్లో పాల్గొన్న అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్, ఇతర సిబ్బంది

వనస్థలిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రజలందరు జాగ్రత్తగా ఉండాలని హయత్‌నగర్ అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ యాదగిరి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సామనగర్‌లోని ఇండియన్ గ్యాస్ గోదాం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ యాదగిరి మాట్లాడుతూ వేసవికాలంలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకుంటు అగ్నిప్రమాదాలను నివారించాలని సూచించారు. అగ్నిప్రమాదం జరిగే సమయంలో ఎలాంటి ఆందోళనకు గురికాకుండా తక్షణమే ఫోన్.నం.101 కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, గోదాం కార్మికులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మలక్‌పేట అగ్నిమాపక దళం అధికారులు, సిబ్బందితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ, మాజీ ఎంపీలపై బీజేపీ ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్, నర్సింహారెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లపై చర్యలు చేపట్టాలని బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ ఇతర నేతలు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజల మనోభావాలు దెబ్బతినేలా, రెచ్చగొట్టేలా ప్రధానమంత్రిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బీజేపీ నాయకులు గోవర్ధన్, ఆకుల అంజన్, కబీర్‌దాస్ పాల్గొన్నారు.

ఓంకార్ నగర్‌కాలనీ ముఖ ద్వారం ప్రారంభం

వనస్థలిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ ఓంకార్ నగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలనీ ముఖ ద్వారాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, లగ్గొని శ్రీధర్ గౌడ్, బోయపల్లి రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.